TEL : T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..

మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

సంపుటి : 01 సంచిక : 235 | గురువారం 01- 05- 2025 | పబ్లిషర్ హైదరాబాద్ | పేజీలు 5 | వెల-5

# అప్పన్న సన్నిధిలో అపశృతి

2లో

- »గోడకూలి ఏడుగురు భక్తుల మృతి
- »నిజరూప దర్శనం కోసం వచ్చి మృత్యువాత
- »భారీ వర్షంతో తడిసిన గోడ కూలడంతో ప్రమాదం
- »సహాయ కచర్యలను పర్యవేక్షించిన మంత్రులు
- »మృతదేహాలు కెజిహెచ్‌కు తరలింపు
- »క్షతగాత్రులకు ఆస్పత్రుల్లో చికిత్స

# తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయ్యిందా?

## కేసీఆర్‌పై సీఎం రేవంత్ ఫైర్



- ప్రతిపక్ష హెూదా ఇచ్చిన ప్రజల వద్దకు కేసీఆర్ ఎందుకు వెళ్లట్లేదని ప్రశ్నించారు.
- బీఆర్ఎస్ సభ ఏర్పాటు చేసుకుంటే బస్సులు ఇవ్వాలని చెప్పాం.
- సభకు అవసరమైన వెసులుబాటు కల్పించాలని అధికారులను ఆదేశించాం.
- ప్రజాస్వామ్యంలో ప్రభుత్వంతో పాటు ప్రతిపక్షం బలంగా ఉండాలి.
- ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయంలో ఎక్కడా మంచి కనబడటం లేదా?
- ప్రభుత్వాన్ని భుజం తడుతూ వైఫల్యాలను ప్రశ్నించాలి.

02

## కులగణనపై తెలంగాణ మాట చెల్లింది

కేంద్ర నిర్ణయంతో రాహుల్ విజన్ సాకారం

కేంద్రానికి సిఎం రేవంత్ కృతజ్ఞతలు

02

## వైభవంగా దేవినేని కుమారుడి వివాహం



02

## నీట్ (యూజీ) అడ్మిట్ కార్డులు విడుదల.




2లో..

## గ్రూప్-1 పరీక్షలు తెలుగులో రాసిన వారి వివరాలివ్వండి.. టీజీపీఎస్సీకి హైకోర్టు ఆదేశం



2లో..

గ్రూప్-1 వ్యవహారంపై హైకోర్టు సింగిల్ బెంచ్ ధర్మాసనంలో విచారణ జరిగింది.

## టీజీపీఎస్సీ గ్రూప్-1 అంశం.. సింగిల్ బెంచ్ ఉత్తర్వుల రద్దుకు సీజే ధర్మాసనం 'నో'



2లో..


తెలంగాణలో గ్రూప్-1 నియామకాలను తాత్కాలికంగా నిలిపివేయాలంటూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది.

## వారంలోగా సమాచారం ఇవ్వండి.. గ్రూప్-1 అంశంపై టీజీపీఎస్సీ ఛైర్మన్‌కు కేంద్రమంత్రి లేఖ



హైదరాబాద్: గ్రూప్-1 వ్యవహారంపై వారం రోజుల్లో సమగ్ర సమాచారం అందించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ టీజీపీఎస్సీని కోరారు. ఈ మేరకు టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశంకు లేఖ రాశారు. గ్రూప్-1 అభ్యర్థుల సందేహాలను లేఖలో ప్రస్తావించారు. గ్రూప్-1లో అవినీతి, అక్రమాలు, తప్పిదాలు జరిగాయని అభ్యర్థులు ఆందోళన చేస్తోన్న విషయం తెలిసిందే. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని పలువురు అభ్యర్థులు బండి సంజయ్‌కి విజ్ఞప్తి చేశారు. వారి ఆందోళనను పరిగణనలోకి తీసుకున్న కేంద్రమంత్రి.. టీజీపీఎస్సీకి లేఖ రాశారు.

## ప్రధాని అధ్యక్షతన 'సూపర్ క్యాబినెట్' భేటీ.. పుల్వామా ఘటన తర్వాత తొలిసారి



పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ ఘటనకు భారత్ తగిన సమాధానం ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో బుధవారం ప్రధాని నరేంద్రమోదీ పలు కీలక సమావేశాలకు అధ్యక్షత వహిస్తున్నారు. దేశ భద్రతపై అత్యున్నత నిర్ణయాలు తీసుకొనే క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ ఈ రోజు రెండోసారి సమావేశమైంది. అనంతరం రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ భేటీ జరిగింది. ఇక, ఈరోజు సాయంత్రం క్యాబినెట్ సమావేశం కూడా నిర్వహించనున్నారు.

**సూపర్ క్యాబినెట్..**

సీసీపీఏ అనేది అత్యంత శక్తివంతమైన గ్రూప్. దానిని 'సూపర్ క్యాబినెట్' అని కూడా పిలుస్తారు. 2019లో జరిగిన పుల్వామా ఉగ్రదాడి అనంతర పరిణామాల నేపథ్యంలో నాడు సీసీపీఏ భేటీ అయింది. ఆ తర్వాత ఈ క్యాబినెట్ కమిటీ మళ్లీ సమావేశం కావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. పేజి 2లో

# ఆ నీళ్లు పాక్‌కు వెళ్తాయి..

## మాకివ్వండి: పంజాబ్‌ను అభ్యర్థించిన హరియాణా



భాక్రా ప్రాజెక్టును వర్షాకాలం ప్రారంభానికి ముందే ఖాళీ చేసి.. దిగువకు నీరు ఇవ్వాలని హరియాణా ముఖ్యమంత్రి నాయబ్‌సింగ్ సైనీ కోరారు.

పంజాబ్ వద్ద భాక్రా రిజర్వాయర్‌లో అదనంగా మిగిలిపోయిన తాగునీరు తమకు ఇవ్వాలని హరియాణా అభ్యర్థించింది. లేకపోతే.. ఆ నీరు పాకిస్థాన్‌కు వెళ్లడం మినహా ప్రయోజనం లేదని పేర్కొంది. భారత్ సింధూ జలాల ఒప్పందం నిలిపివేత నేపథ్యంలో హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ ప్రకటన విడుదల చేశారు. సింధూ జలాల ఒప్పందం పరిధిలోని అతిపెద్ద ఆనకట్టల్లో ఇది కూడా ఒకటి కావడం విశేషం.

"జూన్ నాటికి భాక్రా నంగల్ ఆనకట్టను ఖాళీ చేయడం అవసరం. అప్పుడే వర్షాకాలంలో నదీ జలాలను నిల్వ చేసుకోవచ్చు. రిజర్వాయర్‌లో అప్పుడు నీరు లేకపోతే.. అదనపు జలాలు హరి-కె-పట్టాన్ నుంచి పాకిస్థాన్‌లోకి వెళ్లిపోతాయి. అది అటు పంజాబ్.. ఇటు హరియాణాకు ఉపయోగపడదు.

దిల్లీలో ఆమ్‌ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్నన్నాళ్లు నీటి విడుదలకు పంజాబ్ ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరాలు లేవు. ప్రస్తుతం అక్కడ ఆప్ ప్రభుత్వం లేదు. అలాంటి సమయంలో దిల్లీ ప్రజలను శిక్షించేలా అలాంటి ప్రకటనలు ఎందుకు చేస్తున్నారు. అసలు హరియాణాకు రావాల్సిన వాటా జలాలే అందుబాటులోకి రాలేదు. పేజి 2లో


## పధాని అధ్యక్షతన 'సూపర్ క్యాబినెట్' భేటీ..
## పుల్వామా ఘటన తర్వాత తొలిసారి

మొదటిపేజీ తరువాయి
2019లో పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ వాహనంపై జరిగిన దాడిలో 40 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దానిపై దేశంలో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఈ దారుణ ఘటనపై ప్రతీకార చర్యలు, పరిస్థితిని సమీక్షించేందుకు ఆనాడు సీసీపీఏ సమావేశమైంది. ఆ సమావేశంలోనే పాకిస్థాన్‌కు ఉన్న 'అత్యంత అనుకూల దేశం' వాణిజ్య హోదాను రద్దు చేయాలని భారత్ నిర్ణయించింది. ఆ ఏడాదిలో కొన్ని రోజుల తర్వాత, ఫిబ్రవరి 26న భారత వైమానిక దళం బాలాకోట్‌లోని ఉగ్రవాద శిబిరాలపై వైమానిక దాడి చేసి, దాయాదికి గట్టి సమాధానం ఇచ్చింది.
అత్యంత కీలక సందర్భాల్లో మాత్రమే సీసీపీఏ సమావేశం అవుతుంది. దేశంలోని ముఖ్యమైన రాజకీయ, ఆర్థిక విషయాలను సమీక్షించి నిర్ణయాలు తీసుకుంటుంది. రాజకీయ చిక్కులు కలిగి ఉన్న ఆర్థిక విధానాలు, అంతర్గత భద్రతా సమస్యలపై చర్చలు, నిర్ణయాలు ఉంటాయి. వివిధ మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయానికి సహాయపడుతుంది. దేశ రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్న అంశాలను ఈ భేటీలో చర్చిస్తారు. ప్రధాని మోదీ అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్‌షా, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తదితరులు పాల్గొన్నట్లు తెలుస్తోంది.

# ఆ నీళ్లు పాక్‌కు వెళ్తాయి..
## మాకివ్వండి: పంజాబ్‌ను అభ్యర్థించిన హరియాణా

మొదటిపేజీ తరువాయి
గత నెల భాక్రా బేస్ మేనేజ్‌మెంట్ బోర్డ్ విడుదల చేసిన నీటిలో పంజాబ్, రాజస్థాన్, దిల్లీకి పోగా హరియాణాకు మిగిలింది కేవలం 6,800 క్యూసెక్కులు మాత్రమే. ఇక న్యాయంగా హరియాణాకు రావాల్సిన వాటా ఇచ్చినా.. అది భాక్రా ప్రాజెక్టులో నిల్వ ఉండే నీటిలో 0.0001 శాతానికి సమానం" అని నాయబ్ సింగ్ సైనీ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చీనాబ్, జీలమ్ సహా ఇతర నదుల నీటిని ఉత్తరాది రాష్ట్రాల వ్యవసాయ అవసరాలు తీర్చేందుకు మళ్లించాలని సైనీ కోరారు. ప్రస్తుతం భాక్రానంగల్ ప్రాజెక్టు పంజాబ్, హరియాణా, రాజస్థాన్ నీటి అవసరాలను తీరుస్తోంది.

## జాతీయ భద్రతా సలహా బోర్డు ఛైర్మన్‌గా అలోక్ జోషి



పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా జాతీయ భద్రతా సలహా బోర్డును పునర్వ్యవస్థీకరించింది. అలాగే 'రా' మాజీ చీఫ్ అలోక్ జోషిని ఆ బోర్డు ఛైర్మన్‌గా నియమించింది. ఈ ఘటన వేళ ఈ నియామకం జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆయనతో పాటు ఆరుగురు సభ్యులు ఉన్నారు.
భారత సైన్యంలో పనిచేసిన మాజీ అధికారులు ఎయిర్ మార్షల్ పీఎం సిన్హా, లెఫ్టినెంట్ జనరల్ ఏకే సింగ్, అడ్మిరల్ మోంటీ ఖన్నా, మాజీ ఐపీఎస్‌లు రాజీవ్ రంజన్ వర్మ, మన్మోహన్ సింగ్, మాజీ ఐఎఫ్ఎస్ బి.వెంకటేశ్ వర్మ సభ్యులుగా ఉన్నారు. భద్రతా వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ భేటీలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో పాటు రాజకీయ, ఆర్థిక వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ సమావేశాలు కూడా జరిగాయి.
ఇదిలా ఉంటే.. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందనపై నిర్ణయం భద్రతా బలగాలదే అని నిన్న జరిగిన అత్యున్నత స్థాయి సమావేశంలో ప్రధాని మోదీ స్వేచ్ఛ ఇచ్చారు. ఉగ్రవాదాన్ని మట్టి కరిపించాలన్నది జాతీయ సంకల్పమని, దీనిని నెరవేర్చేందుకు దృఢ నిశ్చయంతో ఉన్నామని అన్నారు. అలాగే ఈ రోజు వరుస భేటీలకు అధ్యక్షత వహించడం చూస్తుంటే.. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకునేందుకు భారత్ సిద్ధమవుతున్నట్లు కనిపిస్తోంది.

## పహల్గాం దాడి ఘటన దృశ్యాలను విడుదల చేయనున్న కేంద్రం!



ఇంటర్నెట్‌డెస్క్: పహల్గాం ఉగ్రదాడి తో దేశం ఉలిక్కిపడింది. ఆ ఘటన వీడియోలను విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. వాటితో పాటు గతంలో పాక్ ఉగ్రవాదులు భారత్‌లో పాల్పడిన దాడుల దృశ్యాలను బయటపెట్టాలని భావిస్తున్నట్లు సమాచారం. పాక్ చేస్తున్న ఘోరాలను ప్రపంచానికి చూపించే ఉద్దేశంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.
పహల్గాం లో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పాక్‌తో దౌత్య సంబంధాలకు సంబంధించి భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడంతో పాటు పాక్ పౌరులు తక్షణమే భారత్ విడిచివెళ్లాలని ఆదేశించింది. ఈ చర్యలతో దాయాది అక్కసు వెళ్లగక్కింది. సిమ్లా ఒప్పందంతోపాటు మిగిలిన ద్వైపాక్షిక ఒప్పందాలను పక్కనబెడుతున్నట్లు ప్రకటించింది.
ఇక నిన్న ప్రధాని మోదీ నివాసంలో నిర్వహించిన కీలక సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, త్రిదళాధిపతి (సీడీఎస్) అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్, ఆర్మీ, నేవీ, ఐఏఎఫ్ అధిపతులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దాదాపు గంట పాటు జరిగిన భేటీలో దేశంలో అంతర్గత భద్రతతో పాటు సరిహద్దులో నెలకొన్న పరిస్థితులపై చర్చించినట్లు సమాచారం. పహల్గాం ఉగ్రదాడి బాధ్యులను శిక్షించాలన్నది దేశ ప్రజల దృఢ నిశ్చయమని ప్రధాని మోదీ ఈసందర్భంగా

## నీట్ (యూజీ) అడ్మిట్ కార్డులు విడుదల.

మొదటిపేజీ తరువాయి
మే 4న దేశ వ్యాప్తంగా జరగనున్న నీట్ (యూజీ) పరీక్షకు ఎన్‌టీఏ ఏర్పాట్లు చేస్తోంది. ఇటీవల సిటీ ఇంటిమేషన్ స్లిప్పులు జారీ చేసిన అధికారులు.. తాజాగా అడ్మిట్ కార్డుల్ని డౌన్‌లోడ్‌కు అందుబాటులో ఉంచారు. విద్యార్థులు తమ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్, క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి అడ్మిట్ కార్డుల్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మే 4న దేశ వ్యాప్తంగా వివిధ పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ పరీక్ష జరగనున్న విషయం తెలిసిందే.
నీట్ అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్‌లో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే విద్యార్థులు 011-40759000/011-69227700 నంబర్లకు లేదా neetug2025@nta.ac.inకు ఈ మెయిల్ చేయడం ద్వారా సంప్రదించవచ్చని అధికారులు సూచించారు.

## గ్రూప్-1 పరీక్షలు తెలుగులో రాసిన వారి వివరాలివ్వండి.. టీజీపీఎస్సీకి హైకోర్టు ఆదేశం

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: గ్రూప్-1 పరీక్షల వ్యవహారంపై హైకోర్టు సింగిల్ బెంచ్ ధర్మాసనం సైతం బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు తమ వాదనలు వినిపిస్తూ.. వరుస హాల్‌టికెట్ల వారికి ఒకే మార్కులు వచ్చాయని, నిర్దేశించిన సమయానికి ప్రొవిజనల్ మార్కుల జాబితా ఇవ్వలేదని కోర్టుకు వివరించారు. 20 రోజుల తర్వాత తుది మార్కులు వెల్లడించారని, ఆ 20 రోజుల్లో అవకతవకలు జరిగాయనే అనుమానంగా ఉందన్నారు. పిటిషనర్ల వాదనలు విన్న ధర్మాసనం.. మూల్యాంకన ప్రక్రియ గురించి టీజీపీఎస్సీని వివరాలు అడిగి తెలుసుకుంది. తెలుగులో రాసిన అభ్యర్థులకు ఎలా మార్కులు వేశారని ప్రశ్నించింది. "తెలుగులో రాస్తే తక్కువ మార్కులేశారన్న ఆందోళన ఉంది. జవాబులకు సంబంధించి ఏదైనా కీ పేపర్ ఉంటుందా? తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాల కీ ఇచ్చారా?' అంటూ టీజీపీఎస్సీకి ప్రశ్నలు సంధించింది. కాగా.. కమిషన్ స్పందిస్తూ ఎవాల్యుయేటర్లకు ఎలాంటి కీ ఇవ్వలేదని తెలిపింది. రాతపూర్వక పరీక్ష కావడంతో కీ ఇవ్వడం కుదరదని, జవాబు పత్రాలు దిద్దిన వారు ఆయా సబ్జెక్టుల్లో నిపుణులని కోర్టుకు వివరణ ఇచ్చింది.
అయితే, తెలుగులో ఎంతమంది రాశారో, ఎంత మంది ఎంపికయ్యారో వారి వివరాలు ఇవ్వాలని టీజీపీఎస్సీని కోర్టు ఆదేశించింది. ఈ పరీక్షతోపాటు గత గ్రూప్-1 అభ్యర్థుల సమాచారం కూడా ఇస్తామని టీజీపీఎస్సీ తెలిపింది. చాలా ఏళ్లుగా నిరుద్యోగులు గ్రూప్ - 1 కోసం ఎదురుచూస్తున్నారని, ఆలస్యం లేకుండా విచారణ ముగించాల్సి ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

## టీజీపీఎస్సీ గ్రూప్-1 అంశం.. సింగిల్ బెంచ్ ఉత్తర్వుల రద్దుకు సీజే ధర్మాసనం 'నో'

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: తెలంగాణలో గ్రూప్-1 నియామకాలను తాత్కాలికంగా నిలిపివేయాలంటూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. గ్రూప్ 1 వ్యవహారంపై టీజీపీఎస్సీ అప్పీల్‌పై హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలంటూ టీజీపీఎస్సీ పిటిషన్ దాఖలు చేయగా.. అందుకు సీజే ధర్మాసనం నిరాకరించింది. సింగిల్ బెంచ్‌లో విచారణ దృష్ట్యా జోక్యం చేసుకోలేమని సీజే ధర్మాసనం స్పష్టం చేసింది. అనంతరం విచారణను గురువారానికి వాయిదా వేసింది. గ్రూప్ 1 మెయిన్స్ మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.
మెయిన్స్ పరీక్షల మూల్యాంకనం సరిగా చేయలేదని, పరీక్ష కేంద్రాల కేటాయింపులోనూ నిబంధనలు పాటించలేదని పిటిషనర్లు ఆరోపించారు. దీనిపై ఇటీవల విచారణ చేపట్టిన జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు ధర్మాసనం.. నియామకాలు తాత్కాలికంగా నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ధ్రువపత్రాల పరిశీలన చేసుకునేందుకు మాత్రం అవకాశం కల్పించింది. అయితే, ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ టీజీపీఎస్సీ సీజే ధర్మాసనంలో పిటిషన్ దాఖలు చేసింది.

# అప్పన్న సన్నిధిలో అపశృతి

మొదటిపేజీ తరువాయి
సింహాచలంలో ఘోర ప్రమాదం జరిగింది. చందనోత్సవం వేళ అప్పన్న సన్నిధిలో అపశృతి చోటుచేసుకుంది. రూ. 300 టికెట్ కౌంటర్ దగ్గర గాలి, వానకు గోడ కూలిపోయింది. ఈ ఘటనలో ఏడుగురు భక్తులు మృతి చెందారు. మరో 10 మందికి తీవ్రగాయాలు అయ్యాయి. శిథిలాల కింద మరికొందరు ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల్లో ముగ్గురు



మహిళలు ఉన్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. సంఘటన ప్రదేశానికి చేరుకున్న సహాయకసిబ్బంది ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సహాయక చర్యలు చేపట్టారు. ఘటనా స్థలానికి చేరుకున్న హోంమంత్రి అనిత, జిల్లా కలెక్టర్ పరిస్థితిని సమీక్షించారు. వెంటనే మృతదేహాలను కేజీహెచ్ ఆస్పత్రికి తరలిస్తున్నారు. సింహాచలం చందనోత్సవం వేళ భారీ వర్షం కురియడంతో గోడ కూలింది. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందారు. ప్రసాదం స్కీం కింద అక్కడ గోడ నిర్మించారు. అక్కడ అభివృద్ధి పనులు చేస్తున్నారు. అందులో భాగంగా గోడ కట్టారు. ఆ గోడ పక్కనుంచే రూ. 3 వందల టిక్కెట్ లైన్ ఉంది. బుధవారం తెల్లవారుజాము 2:30 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో గోడ కూలింది. ఆ ప్రక్క నుంచి క్యూ లైన్ నుంచి వెళుతున్న భక్తులపై గోడ పడింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు ఏడుగురు మృతి చెందినట్లు- సమాచారం. క్షతగాత్రుల తరలింపుకు 17 అంబులెన్సులు ఏర్పాటు చేశారు. సహాయక చర్యలు కొనసాగు తున్నాయి. వరాహ లక్ష్మీనరసింహస్వామి భక్తులకు నిజరూపంలో దర్శనమిస్తున్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు ఇప్పటికే భారీ ఎత్తున సింహగిరికి పోటెత్తారు. వేకువజామున ఒంటిగంటకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. అనంతరం స్వామివారి దేహంపై ఉన్న చందనాన్ని వెండి బొరిగెలతో అత్యంత సున్నితంగా వేరుచేశారు. నిజరూపంలోకి వచ్చిన స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. వైదిక కార్యక్రమాల అనంతరం ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు, ఆయన కుటుంబ సభ్యులకు నిజరూప దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి తొలి చందనాన్ని సమర్పించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తరఫున రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, తితిదే పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉదయం 3 గంటల నుంచి 6 గంటల వరకు ప్రొటోకాల్, అంతరాలయ దర్శనాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే ఈ ఘటన చోటుచేసుకుంది. స్వామివారి నిజరూపాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులపై గోడ కూలడంతో ఏడుగురు మృతి చెందారు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సింహాచలంలో భారీ వర్షం కురిసింది. దీంతో సింహగిరి బస్టాండ్ నుంచి ఎగువకు వెళ్లే మార్గంలో షాపింగ్ కాంప్లెక్స్ వద్ద రూ.300 టికెట్ క్యూలైన్‌పై సిమెంట్ గోడ కూలింది. వెంటనే ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. హోంమంత్రి వంగలపూడి అనిత, విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షించారు. మృతదేహాలను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరిలో సాఫ్ట్‌వేర్ దంపతులు పిళ్లా ఉమామహేశ్వరరావు, శైలజ, ఆమె తల్లి పైలా వెంకటరత్నం, మేనత్త గుజ్జరి మహాలక్ష్మి ఉన్నట్లు నిర్ధరించారు. వీరంతా విశాఖపట్నం నగరానికి చెందిన వారు. మృతుల వివరాలు..ఇలావున్నాయి. పత్తి దుర్గాస్వామి నాయుడు (32), మాచవరం, తూర్పుగోదావరి జిల్లా, ఎడ్ల వెంకటరావు (48) అడవివరం, విశాఖపట్నం, కుమ్మపట్ల మణికంఠ (28), మాచవరం, తూర్పు గోదావరి జిల్లా, గుజ్జరి మహాలక్ష్మి (65), హెబీ కాలనీ, వెంకోజీ పాలెం, విశాఖపట్నం, పైలా వెంకటరత్నం (45), ఉమానగర్, వెంకోజీ పాలెం, విశాఖపట్నం, పిళ్లా ఉమామహేశ్ (30), చంద్రంపాలెం, మధురవాడ, విశాఖపట్నం, పిళ్లా శైలజ (26) చంద్రంపాలెం, మధురవాడ, విశాఖపట్నం.

# తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయ్యిందా?

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: ఇటీవల ఎల్కతుర్తిలో జరిగిన భారాస రజతోత్సవ సభకు తాము సంపూర్ణంగా సహకరించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రవీంద్రభారతిలో నిర్వహించిన బసవేశ్వర 892 జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాలను విడుదల చేసిన అనంతరం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. భారాస రజతోత్సవ వేడుకల్లో మాజీ సీఎం కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన విమర్శలకు కౌంటర్ ఇచ్చారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ కోతుల గుంపునకు అప్పగించినట్లయిందంటూ సీఎం ధ్వజమెత్తారు. ప్రతిపక్ష నేత కుటుంబం తెలంగాణ మీద పడి దోచుకుందన్నారు. 'తెలంగాణ ఆగమైంది.. కాంగ్రెస్ విలన్' అంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై సీఎం తీవ్రంగా మండిపడ్డారు. మరో పదేళ్లు దోచుకోవడం ఆగిందని తెలంగాణ ఆగమైందా? తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయ్యిందా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం, రైతు రుణమాఫీ, ఎస్సీ వర్గీకరణ, కులగణన, రైతుబంధుపై చర్చిద్దామా? అంటూ ఈ సందర్భంగా సవాల్ విసిరారు. ప్రతిపక్ష హోదా ఇచ్చిన ప్రజల వద్దకు కేసీఆర్ ఎందుకు వెళ్లట్లేదని ప్రశ్నించారు.

### ప్రభుత్వ నిర్ణయాల్లో ఎక్కడా మంచి కనబడట్లేదా?

"బీఆర్ఎస్ సభ ఏర్పాటు చేసుకుంటే బస్సులు ఇవ్వాలని చెప్పాం. సభకు అవసరమైన వెసులుబాటుకల్పించాలని అధికారులను ఆదేశించాం. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వంతో పాటు ప్రతిపక్షం బలంగా ఉండాలి. బీఆర్ఎస్ సభకు మేం సంపూర్ణంగా సహకరించింది నిజం కాదా? ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయంలో ఎక్కడా మంచి కనబడటం లేదా? ప్రభుత్వాన్ని భుజం తడుతూ వైఫల్యాలను ప్రశ్నించాలి. మా వైఫల్యాలపై ఎండగట్టాలి.. కానీ, ప్రతిపక్ష నేత ఇంట్లో నుంచి బయటకు వెళ్లకుండా ప్రభుత్వ వసతులు అనుభవిస్తున్నారు. 16 నెలలుగా జీత భత్యాలు తీసుకొని ఫాంహౌస్‌లోనే ఎందుకు ఉంటున్నారు?

### ఇవేవీ కనబడటం లేదా?

అసెంబ్లీకి రాను.. మా పిల్లల్ని పంపామని చెబుతున్నారు. పిల్లలను సభకు పంపితే మీరెందుకు ప్రతిపక్ష నేతగా ఉన్నారు? సభకు రాని ప్రతిపక్ష నేతకు మమ్మల్ని ప్రశ్నించే నైతిక హక్కు ఉందా? ప్రతిపక్ష హోదా ఇచ్చిన ప్రజల వద్దకు ఎందుకు వెళ్లడంలేదు. అధికారం ఉంటే చెలాయిస్తాం. లేకపోతే ఫాం హౌస్‌లో ఉంటామంటున్నారు. గత ప్రభుత్వ పథకాలు నిలిపివేసినట్లు చెబుతున్నారు. మీరు హయాంలోని పథకాలు ఏం ఆగిపోయాయి? రైతుబంధు ఆగిందా?, షాదీముబారక్, కల్యాణలక్ష్మీ, ఫీజురియంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్ ఆగాయా? రాష్ట్రంలో ప్రజా పాలన ఎక్కడైనా ఆగిందా? మేం సన్నబియ్యం ఇస్తున్నాం. పేదల ఇళ్లకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, 60వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. రెండున్నర లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం. ప్రైవేటులో లక్ష ఉద్యోగాలు కల్పించాం. హైదరాబాద్‌ను విస్తరించేందుకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. ఇవేమీ మీకు కనడటంలేదా?. కడుపు నిండా విషం నింపుకొని విద్వేషపూరిత ప్రసంగంతో ప్రజల మధ్య చిచ్చుపెట్టాలనే ప్రయత్నం మంచిదికాదు" అన్నారు.

# కులగణనపై తెలంగాణ మాట చెల్లింది

మొదటిపేజీ తరువాయి
కుల గణన చేపట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర క్యాబినెట్‌కు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం నిర్ణయంతో రాహుల్ గాంధీ విజన్ సాకారం కాబోతోందని పేర్కొన్నారు. రాహుల్ విపక్షంలో ఉండి కూడా కేంద్ర విధానాన్ని ప్రభావితం చేశారు. దేశంలో కులగణన చేపట్టిన తొలి రాష్ట్రం తెలంగాణే. రాహుల్ విజన్‌తో రాష్ట్రంలో కులగనణ చేపట్టాం. కులగణన కోసం కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా పోరాడింది. రాష్ట్ర కాంగ్రెస్ నేతలు దిల్లీలోనూ ఆందోళన చేశారు. తెలంగాణ చేసింది.. దేశం అనుసరిస్తోందని మరోసారి రుజువైందని అన్నారు.కులగణనపై కేంద్రం తీసుకున్న నిర్ణయం పై తాజాగా స్పందించారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా కులగలను చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారని, భారత్ జోడో యాత్రలో చెప్పిన మాట ప్రకారం కులగణన చేసిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. 42 శాతం రిజర్వేషన్ అమలు కోసం అసెంబ్లీ తీర్మానం చేశామని, ప్రతిపక్షంలో ఉన్న రాహుల్ గాంధీ విజన్ అమలులోకి వచ్చిందని ఈ సందర్భంగా తెలిపారు. తెలంగాణ నిర్ణయాన్ని దేశం అమలు చేస్తున్నందుకు గర్వంగా ఉందని, కులగణన చేయాలని కేంద్ర నిర్ణయించడానికి స్వాగతిస్తున్నామని ఆయన అన్నారు. ఈ విషయమై సీఎం ప్రధాని మోడీకి, కేంద్ర మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే జాతీయ జనగణన లో కుల గణన చేర్చడం తెలంగాణ ప్రభుత్వ విజయం అని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కుల గణన రాష్ట్ర వ్యాప్తంగా అమలు జరిగి చట్టం చేసి 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చట్టం చేసి పంపింది. కేంద్ర ప్రభుత్వం బీసీ లకు తెలంగాణ లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ దేశ వ్యాప్తంగా కుల గణన చేయాలని డిమాండ్ చేశామని పొన్నం తెలిపారు. కులగణన చేసి తెలంగాణ దేశానికి దిక్సూచిగా మారిందని, ఇప్పుడే కేంద్ర ప్రభుత్వ జన గణన ద్వారా జనాభా లెక్కల్లో కుల గణన చేస్తామని ప్రకటించింది. ఇది తెలంగాణ ప్రభుత్వ, ప్రజల విజయమని ఆయన అన్నారు. 1931లో బ్రిటిష్ కాలంలో జాతీయ స్థాయిలో కుల గణన జరిగిందని.., ఇది రాష్ట్ర ప్రభుత్వ విజయం సహకరించిన ముఖ్యమంత్రికి ,ఉప ముఖ్యమంత్రికి సహచర మంత్రులకు, పార్టీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ విషయం ఆలస్యమైన చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలని, రాబోయే జనగణనలో కుల గణన చేస్తామని చెప్పడం బలహీన వర్గాల మంత్రిగా మీకు అభినందనలు కృతజ్ఞతలు అంటూ వ్యాఖ్యానించారు.

## వైభవంగా దేవినేని కుమారుడి వివాహం



మొదటిపేజీ తరువాయి
వధూవరులను ఆశీర్వదించిన రేవంత్
తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడి వివాహ వేడుక ఘనంగా జరిగింది. నగర శివారు కంకిపాడులో జరిగిన ఈ వేడుకకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, మంత్రి నారా లోకేశ్ తో పాటు- తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ముఖ్యనేతలు హాజరయ్యారు. నూతన వధూవరులు నిహార్, సాయి నర్మదలను వారు ఆశీర్వదించారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి విజయవాడ చేరుకున్న రేవంత్‌రెడ్డికి హెలిప్యాడ్ వద్ద ఏపీ మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్దన్‌రెడ్డి స్వాగతం పలికారు. రేవంత్, మంత్రి నారా లోకేశ్ కలిసి వివాహ వేడుక వద్దకు వచ్చారు.

# పెండింగ్ సాదాబైనమా దరఖాస్తులకు మోక్షం

**- పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం**

**- అవగాహన సదస్సులలో జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 30 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం ద్వారా పెండింగ్లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులు పరిష్కారం కానున్నాయని, రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. బుధవారం నవీపేట్, జక్రాన్పల్లి మండల కేంద్రాలలోని రైతు వేదికలలో వేర్వేరుగా నిర్వహించిన సదస్సులలో భూభారతి చట్టంపై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ రైతులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూ సమస్యలు పరిష్కరించి రైతులకు వారి భూములపై పూర్తి భరోసా అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం -2025 తెచ్చిందని తెలిపారు. ఈ చట్టం ప్రకారం భూ సమస్యలను సంబంధిత అధికారి ఎన్ని రోజులలో పరిష్కరించాలనే విషయమై స్పష్టమైన మార్గదర్శకాలు పొందుపరుస్తూ నిర్దిష్ట గడువు విధించారని అన్నారు. అధికారి పరిష్కరించిన భూ సమస్యపై అర్జీదారు సంతృప్తి చెందని పక్షంలో అప్పీలు వ్యవస్థను కూడా ఈ చట్టంలో పొందుపరిచారని తెలిపారు. సివిల్ కోర్టుకు వెళ్లే అవసరం లేకుండా జిల్లా స్థాయిలోనే భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ డివిజనల్ అధికారికి, కలెక్టర్ కు అధికారాలు కల్పించారని, ఇదివరకటి తరహాలోనే రెవెన్యూ కోర్టులను పునరుద్ధరించారని తెలిపారు.

గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా భూ వివాదం ఉంటే సివిల్ కోర్టుకు వెళ్లాల్సి వచ్చేదని, భూభారతి చట్టంలో ఆ అవసరం లేకుండా రెండంచెల అప్పీల్ వ్యవస్థ ద్వారా సమస్యలు పరిష్కరించుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. అప్పీలు చేసుకున్న సన్న చిన్నకారు,





పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తారని అన్నారు. గతంలో తహసిల్దార్ స్థాయిలో పరిష్కారం అయ్యే సమస్యలు కూడా కలెక్టర్ దగ్గరికి వచ్చేవని అన్నారు. దీంతో పెద్ద సంఖ్యలో దరఖాస్తులు రావడం వల్ల వాటిని పరిష్కరించడంలో జాప్యం జరిగేదని తెలిపారు. అధికార వికేంద్రీకరణ చేస్తూ భూభారతి ద్వారా కింది స్థాయి అధికారులకు కూడా బాధ్యతలు అప్పగించారని, దీనివల్ల అనేక సమస్యలు మండల స్థాయిలోనే త్వరితగతిన పరిష్కారం అవుతాయని తెలిపారు. భూ భారతిలో మ్యుటేషన్ దరఖాస్తులపై తహసిల్దార్ 30 రోజుల్లోగా విచారణ చేపట్టి నిర్ణయం తీసుకుంటారని అన్నారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ ఒకే రోజు ఉంటాయని అన్నారు. కొనుగోలు, దానం, తనఖా, బదిలీ, భాగం పంపకాల ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసిల్దార్ క్షేత్రస్థాయిలో విచారించి రిజిస్ట్రేషన్ చేసి, హక్కుల రికార్డులు మార్పులు చేసి పట్టాదార్ పాస్ పుస్తకం జారీ చేస్తారని తెలిపారు. భూభారతిలో సెక్షన్ 8 ప్రకారం సివిల్ డిక్రీలు, లోకాయుక్త డిక్రీలు, ఇనాం భూములకు ఓ.ఆర్.సీలు తదితర వాటిని జారీ చేసే అధికారాలను ప్రభుత్వం ఆర్డీఓలకు కల్పించిందని కలెక్టర్ వివరించారు.

భూ భారతి చట్టం ప్రకారం ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డులు తయారు చేసి, ప్రతి సంవత్సరం డిసెంబర్ 31న గ్రామాలలో వాటిని ప్రదర్శించడం జరుగుతుందన్నారు. వ్యవసాయ భూములతో పాటు వ్యవసాయేతర, ఆబాది భూముల రికార్డులను కూడా తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహిస్తారని అన్నారు. భవిష్యత్తులో భూ సమస్యలు తలెత్తకూడదనే ఉద్దేశ్యంతో భూమికి భూదార్ సంఖ్య కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, దీనివల్ల భూ ఆక్రమణలకు అడ్డుకట్ట పడుతుందని అన్నారు. అంతేకాకుండా భూముల సర్వే మ్యాప్ లను సమగ్ర వివరాలు, హద్దులతో పట్టా పాస్ బుక్కులలో పొందుపరుస్తారని అన్నారు. రైతులు లైసెన్స్ సర్వేయర్ ద్వారా సర్వే చేయించి భూముల మ్యాప్ ను సమర్పిస్తే, ప్రభుత్వ సర్వేయర్ పరిశీలించి దానిని పాస్ బుక్కుతో అనుసంధానిస్తారని తెలిపారు.

ప్రస్తుతం ధరణి లో ఉన్న భూ రికార్డులు భూ భారతి చట్టంలో కొనసాగుతాయని తెలిపారు. భూ హక్కుల రికార్డుల్లో ఏమైనా తప్పులు ఉంటే, భూభారతి చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మే, జూన్ మాసాలలో గ్రామాల వారీగా నిర్వహించే రైతు సదస్సులలో అధికారులే గ్రామాలకు వచ్చి భూ సమస్యలు ఉన్న రైతుల నుండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ఈ నూతన చట్టంపై రైతులు వెలిబుచ్చిన సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. ఇంకనూ ఈ చట్టంలో ఎలాంటి అంశాలు ఉంటే బాగుంటుందనే దానిపై సలహాలు కూడా అందించవచ్చని సూచించారు. ఈ సదస్సులలో నిజామాబాద్ ఇంచార్జి ఆర్డీఓ స్రవంతి, ఆర్మూర్ ఆర్డీఓ రాజా గౌడ్, స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు. కాగా, నిజామాబాద్ రూరల్ మండలానికి సంబంధించి గుండారం గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన సదస్సులో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పాల్గొని, భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు.

## కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

**- బిసిటియు జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్**



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 30 :** కేంద్ర కేబినెట్ త్వరలోనే జనాభా లెక్కలతో పాటు కులగణన చేపట్టాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బిసి ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దాదాపు రెండు సంవత్సరాలుగా జన గణన లో బిసి గణను చేపట్టాలని బిసిటియు ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేశామని, ఇప్పటికైనా బిసి లకు జన గణన తరువాత జనాభా దామాషా ప్రకారం విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన కాకతీయ విద్యా సంస్థలు



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 30 :** రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం విడుదలై పదోతరగతి ఫలితాల్లో కాకతీయ విద్యా సంస్థల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారని విద్యా సంస్థల చైర్ పర్సన్ సీహెచ్.విజయలక్ష్మి తెలిపారు. కాకతీయ విద్యార్థి ఎస్.క్రితి 596/600 మార్కులతో స్టేట్ మెదటి ర్యాంకు సాధించిందని తెలిపారు. నితేష్ 591/600 మార్కులతో స్టేట్ ఆరో ర్యాంకు, ఎస్ఎన్వీ అఖిల్ 590/600 మార్కులతో స్టేట్ ఏడో ర్యాంకు, డి.క్రుతి 587/600 మార్కులతో స్టేట్ 10వర్యాంకు, సాయి శ్రేయస్ 586/600 మార్కులతో స్టేట్ 11వ ర్యాంకు, జి.వర్షిణి 586/600 మార్కులతో స్టేట్ 11వ ర్యాంకు, కౌషిక్ ప్రసాద్ 585/600 మార్కులతో స్టేట్ 12వ ర్యాంకు, అబిబా సిద్దిఖి 585/600 మార్కులతో స్టేట్ 12వ ర్యాంకు, గౌతమ్ 585/600 స్టేట్ 13 ర్యాంకు, జశ్వంత్ 584/600 మార్కులతో స్టేట్ 14వ ర్యాంకు, ఆశా గౌర్ 583/600 మార్కులతో స్టేట్ 15వ ర్యాంకు, ఎస్.భవాణి 582/600 మార్కులతో స్టేట్ 15వ ర్యాంకు, జె.యోచన 582/600 మార్కులతో స్టేట్ 15వర్యాంకు, బి.ఆకర్ష 581/600 మార్కులతో స్టేట్ 16వ ర్యాంకు, కె.సహస్ర 580/600 మార్కులతో స్టేట్ 17వ ర్యాంకు సాధించారని తెలిపారు. అనుభవం గల ఉపాధ్యాయులు విద్యార్థులపై అనునిత్యం తమ పర్యవేక్షణ కలినిగిన ఇంచార్జీలు, నాన్ టీచింగ్ సింబ్బంది, తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్ల ఈ విజయం సాధించామన్నారు. కాకతీయ ఒలంపియాడ్ స్కూల్లో స్కూల్ స్థాయి నుంచే ఐఐటి ఉండటం వల్ల ప్రణాళికా బద్ధంగా అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నామని తెలిపారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

**- వేగ నియంత్రణకు స్పీడ్ బేకర్లు ఏర్పాటు**



**సూర్యాపేట (మన వెలుగు) ఏప్రిల్ 30 :** రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తెలిపారు. బుధవారం సూర్యాపేటలో పలు ప్రాంతాల్లో వాహనాల వేగాన్ని నియంత్రించడానికి ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్పీడ్ బ్రేకర్లు వల్ల ప్రమాదాలను కొంతైనా నివారించవచ్చని ఎస్సై తెలిపారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో ప్రతి ఒక్కరు తన పాత్ర పోషించాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు, ఇతర వాహనాల వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా పాటించాలన్నారు. మరియు అదే విధంగా వాహనాలు నడిపే సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదని మద్యం సేవించి వాహనం నడపరాదన్నారు.రాంగ్ రూట్ ప్రయాణం ప్రమాదకరమని అన్నారు....

## పదవి విరమణ పొందిన ఏఎస్ఐ రామ్మూర్తికి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు





**జగిత్యాల (మన వెలుగు) ఏప్రిల్ 30 :** విధి నిర్వహణలో అందరి మన్ననలు అందుకొని స్వచంద పదవీ విరమణ పొందుతున్న ఏఎస్ఐ రామ్మూర్తిని శాలువా,పులమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్.బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన పదవీ విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. ఎన్నో రకాల త్యాగాలతో పాటు కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజలకు సేవలందించడం ఎంతో గర్వకారణమన్నారు. ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పదని అన్నారు. విజయవంతంగా సర్వీస్ పూర్తి చేసిన వారి సేవలను ఈ సందర్భంగా గుర్తు చేస్తూ వారి అనుభవం, సేవలు భవిష్యత్ తరాలకు ఎంతో స్ఫూర్తివంతంగా నిలుస్తాయని చెప్పారు. పదవి విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావిజీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాక్షించారు.అనంతరం పదవి విరమణ పొందిన ఏఎస్ఐ రామ్మూర్తిని పోలీసు వాహనంలో ఎక్కించి పోలీస్ బ్యాండ్ తో ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (ఏఆర్) భీమ్ రావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ వేణు, ఆర్ఎస్ఐ రమేష్,కుటుంబ సబ్యులు పాల్గొన్నారు.

## నగర శివారు ప్రాంతాల్లో పర్యటించిన నుడా చైర్మన్ కేశ వేణు



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 30 :** నగరంలోని శివారు ప్రాంతాల్లో నుడా చైర్మన్ కేశవేణు బుధవారం పర్యటించారు. ఈ సదర్భంగా వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం తీవ్రమైన సమస్యగా మారే అనేక లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ఇది చాలా మంది నివాసితుల జీవితాలను ప్రభావితం చేస్తుందని,ఈ సమస్యలను పరిష్కరించడానికి,ఈ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి రూ.100 కోట్ల అంచనా బడ్జెట్ ప్రతిపాదించబడిందని అన్నారు. ఈ వర్షాకాలంలో వీలైనన్ని ఎక్కువ పనులను పూర్తి చేయాలని,మిగిలిన లేదా పెండింగ్ పనులు వచ్చే వర్షాకాలం నాటికి పూర్తిగా పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళీ మనోహర్ రెడ్డి,ఏఈ వాజిద్ ఖాన్,రషీద్ ఖాన్ ఉన్నారు.

## వెంకటేశ్వర స్వామి కళ్యాణ ఉత్సవాల్లో పాల్గొన్న జువ్వడి కృష్ణారావు

**మెట్ పల్లి రూరల్ (మన వెలుగు) ఏప్రిల్ 30 :**



మండలం సత్తెక్కపల్లి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు బుధవారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడ కృష్ణారావు స్వామి అమ్మవార్లను దర్శించుకుని కళ్యాణంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు జువ్వాడి కృష్ణారావుకు తీర్థ ప్రసాద వితరణ చేసి వేద ఆశీర్వచనం అందజేశారు అనంతరం ఆలయ కమిటీ గ్రామ అభివృద్ధి కమిటీలు జువాడి కృష్ణారావును ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు వెంట మెట్టుపల్లి బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అల్లూరి మహేందర్ రెడ్డి జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షులు నాయిని సురేష్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జెట్టి లింగం స్థానిక మాజీ సర్పంచ్ ఆరెళ్ళ రాజా గౌడ్ మాజీ ఎంపిటిసి వెంకటేష్ శంకర్ నేమురి భూమయ్య భూమేశ్వర్ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## ఆరోగ్యంగా ఉండటానికి ఓపెన్ జిమ్ము ఎంతో అవసరం

**హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్**

**హైదరాబాద్ సిటీ ఇంచార్జ్ (మన వెలుగు) ఏప్రిల్ 30 :** హస్తినాపురం డివిజన్ పరిధిలోని ఇంద్రపస్త కాలనీ ఫేస్1లో ఇటీవల మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేసిన ఓపెన్ జిమ్ పనులను కార్పొరేటర్ సుజాత నాయక్ బుధవారం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఓపెన్ జిమ్ లు ఏర్పాటు చేయడం వల్ల ప్రతినిత్యం ఉదయం సాయంకాలం వేళలో యువకులు,వృద్ధులకు ఓపెన్ జిమ్ లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అనంతరం ఉద్యానవనంను పరిశీలించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తెచ్చిన వెంటనే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత డివిజన్లో కోట్లాది రూపాయలు



మంజూరు చేయించి పనులను ముమ్మరంగా చేపట్టినట్లు తెలిపారు. డివిజన్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన ఏకైక లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షులు వేదరి యోగేశ్వర్ రెడ్డి, మల్లారెడ్డి, నాగభూషణం, రామ్ రెడ్డి,గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి నీరు మరియు పారిశుద్ధ్య మిషన్ సమీక్షా సమావేశం నిర్వహించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన

జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి నీరు మరియు పారిశుద్ధ్య మిషన్ సమీక్ష సమావేశం ను బుధవారం ఐడిఓసి కార్యాలయం డి ఆర్ డి ఓ కార్యాలయం నందు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన సంబంధిత శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా జిల్లాలో నీరు మరియు పారిశుద్ధ్య అమలు, మరుగుదొడ్ల నిర్మాణం మరియు వినియోగం, ప్రతి గ్రామానికి త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ కార్యక్రమాల ద్వారా వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత శాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలో త్రాగునీటి సరఫరాలో తలెత్తే సమస్యలను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు తాగునీటి ఎద్దటి లేకుండా చూడాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. జిల్లాలో భూగర్భ జలాల పెంపొందించేందుకుగాను జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్వాడీ కేంద్రాలు మరియు రైతు వేదికలు అన్నిటిలో రైన్ వాటర్ హార్వెస్టింగ్ మరియు ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వైద్యశాఖ అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఉపాధి హామీ పనులు జరుగు ప్రదేశాలలో ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలలో మరుగుదొడ్లు మరియు విద్యుదీకరణ పనులు త్వరితను పూర్తి చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో మరియు ఆసుపత్రుల్లో మహిళలు, గర్భిణీ స్త్రీలు మరియు పిల్లలకు శానిటేషన్, పారిశుధ్యం పై అవగాహన కల్పించాలన్నారు. విద్యాశాఖ అధికారులు ప్రతి పాఠశాల నందు ఇంకుడు గుంతల నిర్మాణం, పాఠశాల ఆవరణలో ఔషధ మొక్కలు మరియు పాఠశాల విద్యార్థులకు ఔషధ మొక్కల గురించి అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. పాఠశాలల్లో సీడ్ బ్యాంకు ద్వారా విత్తనాల

# 5.74 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తి

**● వీసీ ద్వారా కలెక్టర్లతో మంత్రులు ఉత్తమ్ కుమార్, తుమ్మల సమీక్ష**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 30 :** జిల్లాలో నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడించారు. యాసంగి ధాన్యం సేకరణపై పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీ.ఎస్. చౌహాన్ తో కలిసి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల పరిస్థితి గురించి కలెక్టర్ మంత్రి ఉత్తమ్ కుమార్ దృష్టికి తెచ్చారు. యాసంగిలో జిల్లాలో 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకుని, కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటికే 5.74 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందని తెలిపారు. ఇందులో 5.34 లక్షల మెట్రిక్ టన్నులు సన్న ధాన్యం సేకరణ జరిగిందని, దొడ్డు రకం ధాన్యం 40 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందని వివరించారు. మే చివరి వారం నాటికి లక్ష్యం మేరకు పూర్తిస్థాయిలో 8లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేలా ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. జిల్లాలో 700 పైచిలుకు కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ జరుగుతోందని అన్నారు. ఇంకనూ లక్షన్నర మెట్రిక్ టన్నుల వరకు సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశాలు ఉన్నాయని మంత్రుల దృష్టికి తెచ్చారు. ఇతర రాష్ట్రాల ధాన్యం జిల్లాకు రాకుండా గట్టి నిఘా ఏర్పాటు చేశామని, ముఖ్యంగా జిల్లాకు ఆనుకుని ఉన్న మహారాష్ట్ర సరిహద్దులో మూడు చెక్ పోస్టులను ఏర్పాటు చేసి నిరంతర నిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంచామని, గన్నీ బ్యాగులు వంటి వాటి కొరత లేదని అన్నారు. ప్యాడీ క్లీనర్లు, టార్పలిన్లు, తూకం





యంత్రాలు సరిపడా ఉన్నాయని వివరించారు. ప్రతి కేంద్రంలోనూ సన్న ధాన్యం నిర్ధారణకు గ్రెయిన్ క్యాలీపర్లు వినియోగిస్తున్నారని తెలిపారు. సేకరించిన ధాన్యానికి సంబంధించి వెంటదివెంట రైతుల ఖాతాలలో బిల్లులు జమ చేస్తున్నామని, ఇప్పటివరకు రూ. 875 కోట్ల మేరకు బిల్లుల చెల్లింపులు జరిగాయని కలెక్టర్ వివరించారు. అయితే సన్నలకు సంబంధించిన బోనస్ డబ్బులు మంజూరు కావాల్సి ఉందని అన్నారు. రైస్ మిల్లుల వద్ద, కొనుగోలు కేంద్రాలలో ఎక్కడ కూడా ధాన్యం తూకంలో తరుగు పేరిట కోతలు అమలు చేయకుండా పక్కాగా పర్యవేక్షణ జరుపుతున్నామని అన్నారు. కొనుగోలు కేంద్రాల నుండి నిర్ధారిత రైస్ మిల్లులకు వెంటవెంటనే ధాన్యం తరలించేలా సరిపడా సంఖ్యలో లారీలను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఈసారి యాసంగిలో దేశంలోనే అత్యధికంగా రికార్డు స్థాయిలో తెలంగాణ రాష్ట్రంలో వరి ధాన్యం సాగు అయ్యిందని అన్నారు. 54.89 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా, 137.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వచ్చాయని వివరించారు. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 8329 కొనుగోలు కేంద్రాల ద్వారా 70.13 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించుకోవడం జరిగిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ధాన్యం సేకరణకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ



చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ఎక్కడ కూడా రైతులు ధాన్యం అమ్మకం విషయంలో ఇబ్బంది పడకుండా చూడాలని, ముఖ్యంగా లారీలు, హమాలీల కొరత తలెత్తకుండా పోలీస్, రవాణా శాఖలతో సమన్వయాన్ని పెంపొందించుకుని ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అన్నారు. రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలు సకాలంలో అందించేలా చూడాలని, మిల్లుల సామర్థ్యానికి అనుగుణంగా పూర్తిస్థాయిలో ధాన్యం నిల్వలను కేటాయించాలని సూచించారు. మిల్లర్లు ధాన్యం నిల్వ చేసుకునేందుకు వీలుగా గిడ్డంగులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అకాల వర్షాల వల్ల ధాన్యం నిల్వలు తడిసిపోకుండా వాతావరణ పరిస్థితుల గురించి క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది ముందస్తుగానే రైతులకు తెలియజేస్తూ వారిని అప్రమత్తం చేసేలా చూడాలన్నారు. మరో రెండు, మూడు వారాల పాటు ధాన్యం సేకరణ ప్రక్రియ కొనసాగనున్న దృష్ట్యా, ఎలాంటి ఇబ్బందులకు ఆస్కారం లేకుండా సాఫీగా కొనుగోళ్లు పూర్తయ్యేలా అధికారులు అంకిత భావంతో కృషి చేయాలని హితవు పలికారు. వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్డీఓ సాయాగౌడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్, డీఎస్ఓ అరవింద్ రెడ్డి, డీసీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మలక్ పేట సర్కిల్ ఎస్బిఐ ఆఫీసర్స్ కాలనీలో భారీ అక్రమ నిర్మాణం



OFFICE OF THE GREATER HYDERABAD MUNICIPAL CORPORATION TG-bPASS

TG-bPASS - BUILDING PERMIT ORDER

To,
Sri. Rahul Agarwal & Other Owners
S/o Radheshyam Agarwal
H.No. 16-11-405/85, SBI Officers Colony, Moosarambagh, Hyderabad-500036.

Application No / Permit No: 410146/GHMC/10628/2024
Permit No.: 410146/5586/GHMC/2024
Date: 21-06-2024


Sir/Madam,

Sub: Greater Hyderabad Municipal Corporation - Construction of Individual Residential Building consisting of Stilt for Parking + 2 Upper Floor to an extent of 167.22 Sq.Meters (200.0 Sq.Yds)situated at Plot No/House No: Plot No. 48 Part, House No. 16-11-405/48 Part, Colony: SBI Officers Colony, Survey No: 3, Moosarambagh(V), Malakpet Circle 6, Charminar Zone, Saidabad(M), GHMC, Hyderabad(Dist) - Building Permission-Instant Approval issued - Reg

Ref: 1. Your Application dated: 21-06-2024
2. G.O.Ms.No.168, MA&UD, dt.07-04-2012 and its time to time amendments.

Your application for individual Residential building permission submitted in the reference cited has been sanctioned based on the Self Certification given by you as detailed below and subject to conditions mentioned therein:

| | | | | |
|---|---|---|---|---|
| A | APPLICANT DETAILS | | | |
| 1 | Name | Sri Rahul Agarwal & Other Owners | | |
| B | SITE DETAILS | | | |
| 1 | Survey No | 3 | Plot No | Plot No. 48 Part, House No. 16-11-405/48 Part |
| 2 | Approved Layout Plan | SBI Officers Colony | | |
| 3 | Street/Road | N/A | Colony | SBI Officers Colony |
| 4 | Village Name | Moosarambagh | | |
| 5 | Circle Name | Malakpet Circle 6 | | |
| 6 | Mandal Name | Saidabad | | |
| 7 | Zone Name | Charminar Zone | | |



OFFICE OF THE GREATER HYDERABAD MUNICIPAL CORPORATION TG-bPASS

TG-bPASS - BUILDING PERMIT ORDER

To,
Sri. Tapeshwar Agarwal
S/o Ghanshyam Das
H.No. 16-11-405/85, SBI Officers Colony, Moosarambagh, Hyderabad-500036.

Application No / Permit No: 410156/GHMC/10634/2024
Permit No.: 410156/5587/GHMC/2024
Date: 21-06-2024

Sir/Madam,

Sub: Greater Hyderabad Municipal Corporation - Construction of Individual Residential Building consisting of Stilt for Parking + 2 Upper Floor to an extent of 83.61 Sq.Meters (100.0 Sq.Yds)situated at Plot No/House No: Plot No. 48 Part, House No. 16-11-405/48 Part, Colony: SBI Officers Colony, Survey No: 3, Moosarambagh(V), Malakpet Circle 6, Charminar Zone, Saidabad(M), GHMC, Hyderabad(Dist) - Building Permission-Instant Approval issued - Reg

Ref: 1. Your Application dated: 21-06-2024
2. G.O.Ms.No.168, MA&UD, dt.07-04-2012 and its time to time amendments.

Your application for individual Residential building permission submitted in the reference cited has been sanctioned based on the Self Certification given by you as detailed below and subject to conditions mentioned therein:

| | | | | |
|---|---|---|---|---|
| A | APPLICANT DETAILS | | | |
| 1 | Name | Sri Tapeshwar Agarwal | | |
| B | SITE DETAILS | | | |
| 1 | Survey No | 3 | Plot No | Plot No. 48 Part, House No. 16-11-405/48 Part |
| 2 | Approved Layout Plan | SBI Officers Colony | | |
| 3 | Street/Road | N/A | Colony | SBI Officers Colony |
| 4 | Village Name | Moosarambagh | | |
| 5 | Circle Name | Malakpet Circle 6 | | |
| 6 | Mandal Name | Saidabad | | |
| 7 | Zone Name | Charminar Zone | | |

**●డబుల్ పర్మిషన్ తో ఆరు అంతస్తుల అక్రమ నిర్మాణం**

**●మామూళ్ల మత్తులో టౌన్ ప్లానింగ్ అధికారులు**

**●పెద్ద మొత్తంలో ముడుపులు అందిస్తున్న అక్రమ నిర్మాణదారుడు**

**హైదరాబాద్ సిటీ ఇంచార్జ్ (మన వెలుగు) ఏప్రిల్ 30** మలక్ పేట సర్కిల్ లోని ఎస్బిఐ ఆఫీసర్స్ కాలనీలో అధికారుల అండతో రెండు అనుమతులతో కలిపి ఒకే అక్రమ నిర్మాణం యాదేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అనుమతులు జి ప్లస్ టు ఉండగా అధికారుల అండ మెండుగా ఉండడంతో సదరు అక్రమ నిర్మాణదారుడు యదేచ్ఛగా 6 అంతస్తులు నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మిస్తున్నాడు. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా హైకోర్టు నుంచి అధికారులకు ఎన్నిసార్లు మొట్టికాయలు వేసిన ఆగని అక్రమ నిర్మాణాలు. బాధ్యత కలిగిన అధికారులు తమకేమీ పట్టనట్టుగా అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారుల వద్ద అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ వారు ఈ అక్రమ నిర్మాణం పై చర్యలు ఎందుకు తీసుకోలేకపోతున్నారని ప్రజలు మండిపడుతున్నారు. మామూళ్ల మత్తుకు అలవాటు పడిన టౌన్ ప్లానింగ్ అధికారులకు ఈ అక్రమ నిర్మాణం వద్ద నుండి పెద్ద మొత్తంలో ముడుపులు అందాయని అందుకే వారు మౌనం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల అండ నాకు ఉన్నంతకాలం నాకేం ఇబ్బంది లేదన్నట్టుగా పలువురికి చెబుతున్న నిర్మాణదారుడు. టౌన్ ప్లానింగ్ అధికారులు బాధ్యతగా ఉన్నట్టయితే ఇలాంటి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుని ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా చేయాలే తప్ప ఇలా అక్రమ సంపాదనకు పాల్పడడం హేయమైన చర్య అని ప్రజలు ఛీ కొడుతున్నారు. ప్రజలు కట్టిన పన్నులను లక్షల్లో వేతనాలుగా తీసుకుంటూ ప్రభుత్వం కోసం ప్రజల కోసం పనిచేయాలే




తప్ప వ్యక్తిగత ఆదాయం కోసం పనిచేయడం ఎంతవరకు సబబు అని ప్రజలు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు నిజంగా బాధ్యత కలిగిన అధికారులే అయితే తమపై ఉన్న మచ్చను తొలగించుకొని వెంటనే ఈ అక్రమ నిర్మాణం పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## డ్రంకన్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవర్లకు ట్రాఫిక్ పోలీసుల కౌన్సిలింగ్: ట్రాఫిక్ ఏసీపీ

ట్రాఫిక్ ఏసిపి కార్యాలయం ఖమ్మం

మైనర్ డ్రైవింగ్ తో పాటు మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులను నమోదు చేసి న్యాయస్థానంలో శిక్షలు పడేలా ట్రాఫిక్ పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు.

పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల నగరంలో చేపట్టిన వాహనాల తనిఖీలలో డ్రంకెన్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవర్లు ఎక్కువ సంఖ్యలో పట్టుబడుతునట్లు తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపి ఏదైనా జరగరానిది జరిగితే ఆ తర్వాత కుటుంబ సభ్యులు ఎలా బాధపడతారో తెలిపేలా సిద్ధం చేసిన వీడియోలను స్క్రీన్ పై చూపిస్తున్నామని తెలిపారు. పిల్లలు అనాథలుగా మారడం, యాక్సిడెంట్స్ జరిగితే కుటుంబాలు వీధిపాలు కావడం వంటి వీడియోలు చూపడంతో పాటు తల్లిదండ్రులకు సైతం కౌన్సెలింగ్ ఇస్తున్నామని తెలిపారు. చివరకు మళ్లీ డ్రంకెన్ డ్రైవ్ చేయబోమని వాళ్లతో ప్రమాణం చేయిస్తున్నామని, కౌన్సెలింగ్ తర్వాత వాళ్లను కోర్టులో ప్రొడ్యూస్ చేస్తున్నట్లు తెలిపారు. న్యాయస్థానం జరిమానా విధిస్తున్నారని తరచూ.. తప్పు చేస్తే జైలు శిక్ష కూడా విధిస్తున్నారని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు నగరంతో ప్రతిరోజు డ్రంకెన్ డ్రైవ్స్ తనిఖీలు చేపడుతునట్లు తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ లో మొదటిసారి పట్టుబడితే కౌన్సెలింగ్ ఇచ్చి, కోర్టుకు సబ్మిట్ చేస్తున్నాం.

తరచూ పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయాలని ఆర్టీఏ ఆఫీసర్లకు లెటర్ పెడుతున్నామని తెలిపారు. కాగా డ్రంకెన్ డ్రైవింగ్ కేసులలో పట్టుబడి శిక్ష ఖరారైన వాహనదారులకు

# పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు

**- తక్కువ మార్కులు వచ్చాయని, ఉత్తీర్ణత సాదించలేక పోయామని నిరాశ చెందవద్దు**

**- తల్లిదండ్రులు పిల్లల మానసిక పరిస్థితిని గమనిస్తూ, ధైర్యం కల్పించే విదంగా వాళ్లను ప్రోత్సహించాలి**

**- ఎస్పీ అశోక్ కుమార్**

**జగిత్యాల (మన వెలుగు) ఏప్రిల్ 30 :** పదో తరగతి ఫలితాల సందర్భంగా విద్యార్థులు తమ ఫలితాలపై ఒత్తిడికి లోనవకుండా ఉండాలని, ఆత్మహత్య వంటి తీవ్ర నిర్ణయాలను తీసుకోవద్దని జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ సూచించారు. తక్కువ మార్కులు వచ్చాయని నిరాశ చెంది ఏదైనా అఘాయిత్యం చేసుకుంటే అలాంటి తరహా నిర్ణయాలు తల్లిదండ్రులు, సమాజం, విద్యారంగాన్ని చింతించే విధంగా మార్చేస్తాయి అన్నారు. పరీక్షలలో మార్కులు జీవితానికి తుది నిర్ణయం కావని పరీక్షల్లో తక్కువ మార్కులు వస్తే జీవితంలో ఓడినట్టు కాదని మార్కులు



కేవలం కొలమానం మాత్రమేనని జీవితం మరెన్నో అవకాశాలతో నిండి ఉంది అన్నారు. తల్లిదండ్రు లు, ఉపాధ్యాయులు ఈ సందర్భంలో పిల్లలకు మానసికం గా ధైర్యం కల్పించే విదంగా తోడుగా ఉండాలి, వాళ్లను ప్రోత్సహించాలి, విఫలతల్ని అంగీకరించి దాన్ని మించిన విజయాల వైపు దారి చూపాలి అన్నారు. ఈ సందర్భంగా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

## పాండురంగడు కరుణామయుడు : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



పాండురంగడు కరుణామయుడు అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణం లోని బండ్లగేరి లో రుక్మిణీ పాండురంగ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను కొలిచిన వారికి కొంగు బంగారం పాండురంగడు అని ఆయన చెప్పారు. తల్లితండ్రుల ను మించిన దైవం లేదని, వారికి సేవ చేయడమే భగవంతుని సేవించిన దానికి ఎన్నో రెట్లు ఫలితం పొందవచ్చని చాటిచెప్పిన ఆ పాండురంగ స్వామి ఎంతో మహిమాన్వితమైనవారని మన మహబూబ్ నగర్ పట్టణంలో రుక్మిణీ పాండురంగ స్వామి విగ్రహాలు నేడు ప్రాప్రతిష్టి చేసుకోవడం, ఆ కార్యక్రమంలో నేను పాలుపంచుకోవడం సంతోషంగా ఉందని ఆయన చెప్పారు. అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకి వేద ఆశీర్వాదం అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకుముందు ఎమ్మెల్యేకి పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ శాంతన్న యాదవ్, డీలర్ రఘు, చిన్న, లీడర్ రఘు, రఘు, ప్రవీణ్ యాదవ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ షాపింగ్ మాల్ సూర్యాపేట షీ టీమ్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం



సూర్యాపేట టౌన్

మహిళా రక్షణ చట్టాలు, మహిళల పట్ల వేధింపులపై పిర్యాదు, డయల్ 100, సైబర్ మోసాల నుండి రక్షణ, బాల్య వివాహాలు, లింగ నిర్ధారణ, మూఢనమ్మకాలు, సత్ప్రవర్తనతో పిల్లల పెంపకం మొదలగు అంశాలపై షాపింగ్ మాల్ మహిళా వర్కర్స్ కి అవగాహన కల్పించడం జరిగినది. సందర్భంగా షీ టీమ్స్ ఇన్చార్జి మహిళా ఎస్సై నీలిమ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ శ్రీ నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మహిళల రక్షణ పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉద్యోగం చేసే చోట మహిళలను గౌరవించాలని అన్నారు. ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే పోలీస్ వారికి ఫిర్యాదు చేయాలని అన్నారు, సాంకేతికత పెరగడం వల్ల అదే స్థాయిలో సైబర్ మోసాలు మొబైల్ ఫోన్లకు వచ్చే లింకులు మెసేజ్లు అవగాహన లేకుండా అపరిచితులు తెలపడం బ్యాంక్ అకౌంట్ వివరాలు వ్యక్తిగత వివరాలు అపరిచితులు తెలపడం వల్ల సైబర్ మోసాలు జరుగుతున్నాయని అన్నారు. సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 కి పిర్యాదు చేయాలని కోరారు.

## శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలి




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయం

ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్

పదవీ విరమణ పొందిన ఏఎస్సై ని ఘనంగా సత్కరించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ బుధవారం రోజు పదవీ విరమణ పొందిన ఏఎస్సై సోమేశ్వర రావుని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఎస్పీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. స్పెషల్ బ్రాంచ్ విభాగంలో ఏఎస్సైగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన సోమేశ్వరరావుని ఎస్పీ ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన అధికారులు మరియు సిబ్బంది తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని అన్నారు. గత 40 సంవత్సరాలుగా ప్రజలకు సేవలు అందిస్తూ, పోలీస్ శాఖలో వివిధ విభాగాలలో విధులను నిర్వర్తించి పదవీ విరమణ పొందిన సోమేశ్వరరావు సేవలు మరువలేనివి అని అన్నారు.

ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మరియు పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఇంచార్జి అధ్యక్షులు ఏసోబు మరియు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# లైక్స్ కోసం ఏదైనా రాసేస్తారు.. – మౌనీరాయ్

ఇటీవల తన కొత్త సినిమా ప్రచారంలో భాగంగా జరిగిన ఈవెంట్‌లో నటి మౌనీరాయ్ న్యూలుక్‌లో కనిపించారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆమె అందం కోసం శస్త్రచికిత్స చేయించుకున్నారని ప్రచారం జరిగింది. ఈ లుక్‌లో కొన్ని ఏఐ వీడియోలను కూడా క్రియేట్ చేసి షేర్ చేశారు. తాజాగా దీనిపై మౌనీరాయ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇలాంటివి ప్రచారం చేసేవారిని చూస్తే జాలి వేస్తుందన్నారు.

“నా లుక్‌పై వచ్చిన ఎన్నో ఏఐ వీడియోలు చూశాను. అవి భయంకరంగా ఉన్నాయి. నా ముఖాన్ని వేరొకరి శరీరానికి అతికించారు. ఆ వీడియోలు చూడడానికి కూడా చాలా అసహ్యంగా ఉన్నాయి. ఇలాంటివి క్రియేట్ చేయడం వల్ల వారికి ఎలాంటి ఆనందం వస్తుందో నాకు ఇప్పటికీ అర్థం కాదు. వారి లక్ష్యం ఏమిటనేది తెలియదు. ఇలాంటివారు ఎవరిలోనూ మంచిని చూడలేరు. నేను సోషల్ మీడియాను ఉపయోగించడం ప్రారంభించిన తొలినాళ్లలో నెగెటివ్ కామెంట్స్ చేసేవారి ప్రొఫైల్ ఓపెన్ చేసి వారి గురించి తెలుసుకొని బ్లాక్ చేసేదాన్ని. ఇప్పుడు ఇలాంటి వారిని చూస్తే జాలి వేస్తోంది. వారికి సరైన బుద్ధిని ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తాను. వారి లైక్‌ల కోసం సెలబ్రిటీలపై చెత్త సమాచారమంతా రాస్తారు” అని అసహనం వ్యక్తం చేశారు.ప్రస్తుతం మౌనీరాయ్ ‘ది భూత్నీ’ ప్రచారంలో బిజీగా ఉన్నారు. సంజయ్‌దత్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాకు సిద్ధాంత్ సచ్‌దేవ్ దర్శకత్వం వహించారు. మే1న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా తనకు చాలా ప్రత్యేకమని మౌనీ ఇటీవల ఓ కార్యక్రమంలో తెలిపారు. ఇందులోని స్టంట్స్ కోసం డూప్స్‌ను ఉపయోగించలేదని.. తానే స్వయంగా చేశానని చెప్పారు.



# నాకోసం ఎన్నో త్యాగాలు చేసింది: భార్యపై ప్రశంసలు కురిపించిన అజిత్

తాజాగా పద్మభూషణ్ అవార్డు అందుకున్నారు కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ . ఈ పురస్కారం అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని.. ఇది తనకు ప్రేరణగా నిలుస్తుందని ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ సందర్భంగా తన భార్య షాలినిపై ప్రశంసలు కురిపించారు. ఆమె ఎన్నో త్యాగాలు చేసినట్లు చెప్పారు.“నేను ఇప్పటికీ సామాన్యుడిలానే ఆలోచిస్తాను. ఇంతటి విజయాన్ని సాధించినందుకు ఒక్కోసారి ఆశ్చర్యంగా అనిపిస్తుంటుంది. ఈ స్థాయిలో ఉండడానికి నా భార్య షాలినినే కారణం. ఆమె నాకోసం ఎన్నో త్యాగాలు చేసింది. ప్రతి పనిలోనూ నాకు తోడుంటుంది. ఒక్కోసారి నేను సరైన నిర్ణయాలు తీసుకోకపోయినా ఆమె అండగా నిలిచింది. నన్ను ఎప్పుడూ నిరుత్సాహ పరచలేదు. నా కష్ట సమయాల్లో పక్కనే ఉండి భరోసానిచ్చింది. నా జీవితంలో సాధించిన సక్సెస్ క్రెడిట్ అంతా ఆమెకే ఇస్తాను. ఎంతో ప్రజాదరణ పొందిన నటి అయినప్పటికీ నాకోసం అన్నిటికీ దూరమైంది. ఆమెకు ఎంతోమంది అభిమానులు ఉన్నారు. వారందరికీ కూడా నేను ఈసందర్భంగా కృతజ్ఞతలు చెబుతున్నాను” అని చెప్పారు.“నేను కేవలం నటుడిని. నటన నాకు జీతాన్నిచ్చే ఓ ఉద్యోగంగా భావిస్తాను. సూపర్‌స్టార్ అని పిలిపించుకోవడం నచ్చదు. ఎందుకంటే అలాంటి ట్యాగ్స్‌పై నాకు నమ్మకం లేదు. 33 ఏళ్లుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్నాను. నా వృత్తిని ప్రేమిస్తాను. జీవితమంతా అభిమానులను అలరించడానికే ప్రయత్నిస్తాను. సాధ్యమైనంతవరకూ సాదాసీదాగా ఉంటాను. అతిగా ఆలోచించను. ఒకేసారి ఎక్కువ ప్రాజెక్ట్‌లు అంగీకరించను. నటనతో పాటు నా ఇతర ఆసక్తులపై కూడా దృష్టిపెడతాను” అని అజిత్ తెలిపారు.

# పబ్లిసిటీ గురించి అసలు పట్టించుకోను – వెంకటేశ్



రజనీకాంత్‌తో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు స్టార్ హీరో వెంకటేశ్. ఓ తమిళ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన ఆధ్యాత్మిక ప్రయాణం గురించి చెప్పారు. అలాగే తాను ఇండస్ట్రీకి వచ్చినప్పుడు రజనీకాంత్ ఓ సలహా ఇచ్చారని అప్పటినుంచి ఇప్పటివరకూ ఆ సలహానే పాటిస్తున్నానన్నారు.“రజనీకాంత్‌కు, నాకు ఇద్దరికీ ఆధ్యాత్మిక భావాలు ఎక్కువ. ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. మా నాన్నతో కలిసి ఆయన వర్క్ చేశారు. నేను ఇండస్ట్రీకి వచ్చినప్పుడు ఒక మాట చెప్పారు. సినిమా రిలీజ్ సమయంలో బ్యానర్లు కట్టారా? పోస్టర్‌లలో మన ముఖం బాగా కనిపిస్తుందా? మ్యాగజైన్ ఫ్రంట్ పేజ్‌లో మన ఫొటో వేశారా? ఇలాంటి వాటి గురించి ఆలోచించొద్దన్నారు. మన పని మనం చేసుకుంటూ వెళ్లాలని సూచించారు. అప్పటినుంచి ఇప్పటివరకూ అదే సలహాను పాటిస్తున్నాను. పబ్లిసిటీ గురించి పట్టించుకోను. దేని గురించి ఎక్కువగా ఆలోచించను” అని వెంకటేశ్ చెప్పారు.
ఇక ఇదే ఇంటర్వ్యూలో వెంకటేశ్ తనకు అరుణాచలం అంటే ఎంతో ఇష్టమని తెలిపారు. రమణ మహర్షిని ఆరాధిస్తానని తెలిపారు. చిన్నప్పటినుంచి ఆధ్యాత్మిక భావాలు ఎక్కువేనని చెప్పారు. దేవుడంటే భయం ఎక్కువని.. భగవంతుడికి సంబంధించిన ఎన్నో పుస్తకాలు చదివినట్లు తెలిపారు. ‘ఘర్షణ’ సమయంలో తాను ప్రయాణిస్తున్న పడవ మునిగిపోయిందని దేవుడి దయతోనే ఎలాంటి ప్రమాదం జరగకుండా బయటపడినట్లు చెప్పారు.

# జాక్ పాట్ కొట్టింది.. అల్లు అర్జున్ కి జోడీగా దేవరకొండ హీరోయిన్!

గ్లామర్ రోల్స్‌తోనే కాదు నటనకు ప్రాధాన్యత గల పాత్రలతోనూ మెప్పించగలనని నిరూపిస్తోంది అనన్య పాండే. అక్షయ్ కుమార్ హీరోగా ఇటీవల వచ్చిన ‘కేసరి 2’చిత్రంలో ఆమె కీలకపాత్ర పోషించింది.ఇందులో తన నటన చూసిన వాళ్లంతా ప్రశంసలు కురిపిస్తున్నారు. గతంలో తన నటనను విమర్శించిన వాళ్లు కూడా ఇప్పుడు తన పెర్ఫార్మెన్స్‌కు ఫిదా అవుతున్నారు.ఇదిలా ఉంటే అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కబోయే క్రేజీ ప్రాజెక్ట్‌లో అనన్య నటించబోతోందని సమాచారం. అట్లీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ సంస్థ హ్యూజ్ బడ్జెట్‌తో నిర్మిస్తోంది.ఇందులో ముగ్గురు హీరోయిన్స్ నటించాల్సి ఉండగా ఇప్పటికే జాన్వీకపూర్, మృణాల్ ఠాకూర్‌లను ఎంపిక చేశారని, మరో హీరోయిన్‌గా అనన్యపాండే నటించనుందనే ప్రచారం జరుగుతోంది.గతంలో విజయ్ దేవరకొండకు జంటగా ‘లైగర్’లో నటించగా, ఆ సినిమా పరాజయం పాలవడంతో తీవ్ర నిరాశ ఎదురైంది. కొంత గ్యాప్ తర్వాత మళ్లీ ఇప్పుడు మరో టాలీవుడ్ స్టార్‌తో నటించే అవకాశం వచ్చింది.ఇటీవల బాలీవుడ్‌లో వరుస చిత్రాలతో మెప్పిస్తున్న అనన్య.. ఈ సినిమాతో సౌత్‌లోనూ సత్తా చాటే అవకాశం ఉంది. మరి అనన్య ఎంపిక కేవలం ప్రచారమేనా లేక హీరోయిన్‌గా కన్ఫర్మ్ చేస్తారో చూడాలి!



# ‘పెద్ది’.. బరిలోకి మళ్లీ అప్పుడే!



కథానాయకుడు రామ్‌చరణ్.. దర్శకుడు బుచ్చిబాబు సానా కలయికలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం ‘పెద్ది’. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ కథానాయిక. శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవలే హైదరాబాద్‌లో ఓ కీలక షెడ్యూల్ పూర్తి చేసుకున్న ఈ సినిమా.. తదుపరి షెడ్యూల్‌ను మే రెండో వారంలో ప్రారంభించుకోనున్నట్లు సమాచారం. ఈలోగా చరణ్ మే 9న లండన్ టుస్సాడ్స్‌లో జరిగే తన మైనపు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలోనూ.. 11న రాయల్ ఆల్బర్ట్ హాల్‌లో జరగనున్న ‘ఆర్‌ఆర్‌ఆర్’ రాయల్ ఫిల్హార్మోనిక్ లైవ్ కన్సర్ట్‌లోనూ పాల్గొననున్నారు. ఈ వేడుకలో చెర్రీతో పాటు ఎన్టీఆర్, రాజమౌళి, కీరవాణి సందడి చేయడమే కాక ప్రీ-ఫిల్మ్ టాక్‌లో భాగంగా ప్రేక్షకులతోనూ ముచ్చటించనున్నారు. మే 14తర్వాత రామ్‌చరణ్ మళ్లీ ‘పెద్ది’ చిత్రీకరణ కోసం సెట్లోకి అడుగు పెట్టనున్నట్లు తెలిసింది. ఇది ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే బలమైన భావోద్వేగాలు నిండిన క్రీడా నేపథ్య చిత్రంగా ముస్తాబవుతోంది. దీంట్లో చరణ్ ఆట కూలీగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీత దర్శకుడిగా వ్యవహరించనున్నారు.